

.. గుర్తుంచుకో రామకా!

ఎన్నికల ప్రచారానికి కావాల్సిన పాటలు రాసే వారికే కాకుండా పాడే వారికి, ఇతర కళాకారులకు ఉపాధి లభిస్తోంది. 10లో



ఎంసీహెచ్‌లో నిలిచిన పరీక్షలు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎంసీహెచ్‌లో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు పదిహేను రోజులుగా నిలిచిపోయాయి. 12లో

గరిష్టం / కనిష్టం
34° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం సాయంత్రం చలి ప్రభావం పెరిగే అవకాశముంది. మిగతా సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి.

న్యూస్‌రీల్

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా జావీద్‌పాషా



జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: ఖమ్మం న్యాయసేవాసంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా బదిలీ అయ్యారు. ఆయనను ఖమ్మంలోనే ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ హైకోర్టు వర్గాల నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు

పాలేరు నుంచి నేడు వైరా రిజర్వాయర్‌కు..

ఖమ్మంఅర్బన్: తాగునీటి పథకాలను నీరు అందించే జలాశయాలు అడుగంటకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని పాలేరు, వైరా రిజర్వాయర్లను నింపేందుకు సాగర్ ప్రధాన కాల్వ నుండి నీటిని విడుదల చేశారు. ప్రధాన కాల్వకు సాగర్ డ్యాం నుంచి రోజుకు 4,500 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ఈ జలాలు శనివారం నాటికి పాలేరు రిజర్వాయర్‌కు చేరుకోనుండగా, అక్కడి నుంచి వైరా రిజర్వాయర్‌కు విడుదల చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో తాగునీటి అవసరాల కోసం మొత్తంగా రెండు టీఎంసీల నీటిని డ్యాం నుంచి విడుదల చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని చెప్పారు. అలాగే, ఇంకో రెండు టీఎంసీలను ఏపీ అవసరాల కోసం విడుదల చేయనుండడంతో నిరంతరాయంగా పది రోజులు నీటి సరఫరా కొనసాగుతుంది. పాలేరు జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులకు గాను 16.5 అడుగులు, వైరా రిజర్వాయర్‌లో 18 అడుగులకు గాను 9.10 అడుగుల మేర నీరు ఉంది. దీంతో తాగునీటి సరఫరాకు సమస్య రాకుండా సాగర్ జలాలను విడుదల చేశారు.

ఆదాయపు పన్ను చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న శ్యాంసుందరం

ఖమ్మంవ్యవసాయం: ఆదాయం పన్ను చట్టం, ఆన్‌లైన్ లావాదేవీలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ ఇన్‌కంట్యాక్స్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ (ఐఅండ్‌సీఐ) అధికారి కె.శ్యాంసుందరం తెలిపారు. ఖమ్మంలోని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శుక్రవారం వ్యాపారులకు ఆదాయపు పన్ను చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరం మాట్లాడుతూ ప్రతీ కొనుగోలు, అమ్మకం వివరాలు వివిధ శాఖల్లో ఆన్‌లైన్ అవుతుండగా, ఆ వివరాలన్నీ తమకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే, అధికారులు కేపీసీ.శేఖర్, ఎంపీ.సాయికుమార్ ఆదాయ పన్ను చెల్లింపులు, చట్టాలను వివరించారు. చాంబర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, డి.చిన్న వెంకటేశ్వర్లు, యడ్లపల్లి సతీష్, తేరాల ప్రవీణ్, కె.ప్రవీణ్‌కుమార్, రాంపూడి నాగేశ్వరరావు, పి.అచ్చుతరావు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్సే

‘తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే. కాంగ్రెస్ తుఫాను ఇక్కడ రాబోతుందని కేసీఆర్‌కు ఇప్పటికే అర్థమైంది. ఈ సభలో ఊపుతున్న చేతులే అందుకు తార్కాణం. మనం గట్టిగా చేతులు ఊపితే రాష్ట్రంలో కేసీఆర్, ఆయన పార్టీ కనిపించకుండా పోతుంది.’ అని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ అన్నారు. మణుగూరులో శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కానీ ఇప్పుడు దొరల తెలంగాణ రాష్ట్రంలో కొలువైందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలన్నీ ఒక కుటుంబానికే పరిమితమయ్యాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ప్రజల తెలంగాణ కోసం కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో పోరాటం చేస్తోందని తెలిపారు. ధరణి వల్ల నష్టపోయిన రైతులకు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 24 గంటల కరెంటు కేవలం కేసీఆర్ ఇంట్లోనే వస్తుంది తప్పితే మిగిలిన చోట్ల రావడం లేదని రాహుల్ విమర్శించారు. ఎప్పుడూ ఇంటి గడప దాటని కేసీఆర్‌కు రాష్ట్రంలో ఉన్న కరెంటు కష్టాలు తెలియవన్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఊగే చేతుల తుఫానులో కేసీఆర్ కనుమరుగు

- ప్రజల తెలంగాణ కోసమే కాంగ్రెస్ ప్రయత్నం
- మణుగూరు మీటింగ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ
- జంప్ జిలానీలకు బుద్ధి చెప్పాలి : పొంగులేటి
- ప్రస్తుత ఎమ్మెల్యే కాంగ్రెస్ ఆఫీస్‌నూ కబ్జా చేశారు : పాయం



మణుగూరు సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ

జై కాంగ్రెస్ నినాదాల హోరు..

నిర్దేశిత సమయం కంటే సుమారు గంట ఆలస్యంగా రాహుల్‌గాంధీ కార్యక్రమం మొదలైంది. విజయవాడ నుంచి హెలికాప్టర్ ద్వారా నేరుగా డిగ్రీ కాలేజీ మైదానానికి చేరుకున్న రాహుల్, అక్కడి నుంచి మెరుపు వేగంతో అంబేద్కర్ కూడలికి చేరుకున్నారు. అక్కడ కార్నర్ మీటింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక జీప్‌పైకి క్షణాల్లో చేరుకున్నారు. వైట్ టీ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించిన రాహుల్ గాంధీ వాహనం నలువైపులా తిరుగుతూ ప్రజలకు అభివాదం చేశారు. రాహుల్ వాహనంపైకి చేరుకున్నది మొదలు ప్రసంగం మొదలు పెట్టే వరకు నలువైపులా ప్రజలు జై కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తించారు.

నేను చెప్పిందే చెప్పండి

ప్రసంగం ప్రారంభిస్తూ రాహుల్ గాంధీ ముందుగా హిందీలో నమస్కార్ అంటూ మొదలెట్టారు. ఆ వెంటనే సర్దుకుని నమస్కారం అంటూ తెలుగులో సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. అయితే పక్కనే ఉన్న అనువాదకుడు మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన అక్కలు, చెల్లెళ్లు, అన్నలు, తమ్ముళ్లు, మహిళలు, వృద్ధులు.. అందరికీ నమస్కారం అంటూ తర్జుమా చేశారు. దీంతో వెంటనే రాహుల్‌గాంధీ కల్పించుకున్నారు. ‘కేవలం నేను ఏదీ చెప్పానో అది మాత్రమే చెప్పండి’ అంటూ అనువాదకుడికి హిందీలో సూచించారు.

ఇసుకదందాలు, భూ కబ్జాలు..

రాహుల్ గాంధీ ప్రసంగానికి ముందు పీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడి మాట్లాడారు. పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు గెలుపు కోసం రాహుల్‌గాంధీ ఇక్కడికి వచ్చారని తెలిపారు. కాంగ్రెస్ గుర్తు మీద గెలిచిన అభ్యర్థి జంప్ జిలానీ అయ్యాడంటూ పరోక్షంగా రేగా కాంతారావుపై విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం మాట్లాడుతూ రాహుల్ గాంధీ రాక సందర్భంగా ఏజెన్సీలోని ఏడు మండలాల నుంచి వచ్చిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే అరాచక పాలనతో నియోజకవర్గంలో అభివృద్ధి ఐదేళ్లు వెనక్కి పోయిందన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన ప్రస్తుత ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌ను కూడా కబ్జా చేశాడంటూ రేగాపై విమర్శలు గుప్పించారు. రంగులు మార్చే వ్యక్తి కావాలో, గిరిజనులు, గిరిజనేతరులను ఒకేలా చూసుకునే పాయం కావాలో ఓటర్లు తేల్చుకోవాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఇసుకదందాలు చేస్తే తాను పవర్ ప్లాంట్ తెచ్చానని, రేగా భూములు కబ్జా చేస్తే తాను డిగ్రీ కాలేజీ, ఐటీఐ, ఫైర్ స్టేషన్లను తీసుకొచ్చానంటూ ఆయన చెప్పారు. పినపాకలో కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 11 గంటల నుంచే..

రాహుల్ గాంధీ పర్యటన మధ్యాహ్నం12:15 గంటలకు ఖరారైంది. అయితే ఉదయం11 గంటలకే జిల్లా నలుమూలల నుంచి రాహుల్ కార్నర్ సభ కోసం ప్రజలు రావడం మొదలైంది. దీంతో పోలీసులు మణుగూరు పట్టణంలో ట్రాఫిక్ మళ్లించారు. మధ్నాహ్నం 12 గంటల లోగా భద్రాచలం–ఏటూరునాగారం రహదారిపైకి ప్రజలు భారీగా తరలివచ్చారు. పక్కనున్న భవనాలపైకి చేరుకుని రాహుల్ రాక కోసం ఎదురు చూశారు. అయితే షెడ్యూల్ సమయం కంటే గంట ఆలస్యంగా కార్యక్రమం మొదలవడంతో రాహుల్ రోడ్‌షో చేయలేకపోయారు. నేరుగా అంబేద్కర్ సెంటర్ చేరుకుని కార్నర్ మీటింగ్‌లో పాల్గొని తిరిగి నర్సంపేటకు వెళ్లిపోయారు.

వినపడలేదు

రాహుల్ ప్రసంగం వినేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల కొద్దీ ఎండలో నిలబడిన ప్రజలకు అంతంత మాత్రంగా జరిగిన ఏర్పాట్లు ఇబ్బంది కలిగించాయి. కార్నర్ మీటింగ్ కోసం ఏర్పాటు చేసిన మైక్, సౌండ్ సిస్టమ్ దూరంగా ఉన్న వారికి సరిగా వినిపించలేదు. పది నిమిషాల సేపు మౌనంగా ఉన్నా మాటలు సరిగా అర్థం కాకపోవడంతో దూరంగా ఉన్న వారు ప్రసంగం వినడంపై ఆసక్తిని కోల్పోయారు. ఆఖరికి సోషల్ మీడియా లింకుల్లో సైతం సాంకేతిక సమస్య ఎదురుకావడం కాంగ్రెస్ అభిమానులను ఆవేదనకు గురిచేసింది.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్..

బూర్గంపాడు: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మణుగూరు పర్యటన కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. మణుగూరు అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కార్నర్ మీటింగ్‌కు తరలివచ్చారు. రాహుల్ పర్యటన నేపథ్యంలో మణుగూరు పట్టణం జనసంద్రంగా మారింది. రాహుల్ గాంధీ రావటానికి ముందు కాంగ్రెస్ నాయకులు పొలెబోయిన శ్రీవాణి, బట్టా విజయ్‌గాంధీ, తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ నాయకులు బొల్లోజు అయోధ్య మాట్లాడారు. రాహుల్ గాంధీ సభకు వచ్చిన తర్వాత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ఆయన వివరించారు.



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అదనపు బ్యాలెట్ యూనిట్లు

- జిల్లాకు 894 యూనిట్ల కేటాయింపు
- ర్యాండమైజేషన్ తర్వాత నియోజకవర్గాలకు..



బ్యాలెట్ యూనిట్ల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



జలగంనగర్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల నేపథ్యాన జిల్లాకు అదనపు బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల సంఘం కేటాయించింది. ఈ సందర్భంగా 894 బ్యాలెట్ యూనిట్లు జిల్లాకు శుక్రవారం చేరుకోగా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పార్టీల ప్రతినిధుల సమక్షాన జెడ్పీ ఆవరణలోని గోదాంలో భద్రపరిచారు. ఇప్పటికే బ్యాలెట్ యూనిట్లు ఉన్నా పోటీలో మిగిలిన అభ్యర్థుల సంఖ్య ఆధారంగా మరిన్ని కేటాయించారని కలెక్టర్ తెలిపారు. వీటి ర్యాండమైజేషన్ చేపట్టాక నియోజవర్గాలకు పంపిస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, తహసీల్దార్ సీహెచ్.స్వామి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, ఉద్యోగులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ తనిఖీ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారంపై ఆరా తీశారు. ఇప్పటివరకు సీ విజిల్ యాప్ ద్వారా 367 ఫిర్యాదులు రాగా పరిష్కరించామని, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 616 మంది ఫోన్ చేశారని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఓ ఏ.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల్లో వసతులు

ఖమ్మంరూరల్/కూసుమంచి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలంలోని జలగంగనర్, తల్లంపాడు ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ కేంద్రంలో టాయిలెట్లు, నీటి వసతితో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించడమే కాక ర్యాంప్‌లు నిర్మించాలని తెలిపారు. అలాగే, జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌తో పాటు మరో చెక్‌పోస్ట్‌ను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ పార్టీల నాయకులు, అభ్యర్థుల వాహనాలే కాక పోలీస్, ప్రభుత్వ వాహనాలు, అంబులెన్స్‌లను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. అలాగే, నగదు, మద్యం రవాణా జరగకుండా కట్టడి చేయాలని సూచించారు. తొలుత కూసుమంచిలో పలువురు ఓటర్లతో మాట్లాడి కలెక్టర్ ఓటరు స్లిప్పుల పంపిణీపై ఆరా తీశారు. ఈకార్యక్రమాల్లో పాలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరీ,ఎంపీడీఓ రమాదేవి, సీఐ జితేందర్‌రెడ్డి, ఈఈ నాగేశు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

జంగ్ తెలంగాణ

సీపీ విష్ణు ఎస్.వారియర్



వీసీలో మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆదేశించారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యాన ఖమ్మం నుంచి శుక్రవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ గుమిగూడకుండా చూడాలని, వాహనాల పార్కింగ్‌కు అనుమతించొద్దని సూచించారు. కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడాన్ని పోలీసులు బాధ్యతగా భావించాలని చెప్పారు. ఇక నిషేధిత పదార్థాలను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీ చేయడంతో పాటు, ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే పోలీసులెవరూ బూత్‌ల్లోకి ప్రవేశించవద్దని సీపీ వారియర్ సూచించారు.

పర్వతారోహకుడికి ఘన స్వాగతం



మోతీకుమార్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పెనుబల్లి: రష్యాలో సముద్ర మట్టానికి 5,642 మీటర్ల ఎత్తులో ఉన్న యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తయిన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని జిల్లాకు చెందిన బర్మావత్ మోతీకుమార్ ఇటీవల అధిరోహించారు. పెనుబల్లి మండలం వీఎం.బంజర్‌కు చెందిన ఆయన శుక్రవారం స్వగ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా అభయ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ చలమాల నర్సింహారావు ఆధ్వర్యాన ఘనస్వాగతం పలికారు. త్వరలోనే ఎవరెస్టు పర్వతాన్ని కూడా అధిరోహించి దేశ ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం వీఎం బంజర్ రింగ్ సెంటర్‌లో విద్యార్థులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయుడు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేడా రామారావుతోపాటు ధర్మంసోత్ దశరథ్ నాయక్, బోడపుట్ల శంకర్, వేముల నర్సింహారావు, బెజవాడ సాయిశేషు, సమీరా, మంజుల, సుమతి, స్నేహ, జీవన, మంగూనాయక్, నర్సింహారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేతల అడ్డా.. వైరా గడ్డ!

- ఒకే మండలం నుంచి చట్టసభలకు ఏడుగురు
- ఎమ్మెల్యేలు, ఎంపీలుగానే కాక ఉన్నత పదవులు సైతం..
- జాబితాలో ముగ్గురు ‘మల్లు’ బ్రదర్స్

ఉమ్మడి జిల్లా రాజకీయ పటంలో ఏ ప్రాంతానికి దక్కని ఖ్యాతి వైరాకు ఉంది. ఈ మండలం నుంచి ఒకరు.. ఇద్దరు కాదు ఏకంగా ఏడుగురు చట్టసభల్లోకి అడుగుపెట్టారు. ఒకే మండలానికి చెందిన ఇంత మంది లోక్‌సభ, అసెంబ్లీకి ఎన్నిక కావటం అరుదనే చెప్పాలి. వీరిలో ముగ్గురు అన్నదమ్ములు ఉండడం మరో విశేషం. – వైరా



లక్ష్మీపురం నుంచి అడుగులు



మల్లు అనంతరాములు


వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లు అనంతరాములు 1980లో తొలిసారిగా మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూలు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండడంతో జాతీయ స్థాయిలో వ్యవసాయ సంబంధ కార్పొరేషన్ చైర్మన్ పదవి కూడా దక్కింది. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, పదకొండు రాష్ట్రాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పనిచేశారు. 1989లో తిరిగి నాగర్‌కర్నూలు నుంచి పోటీ చేసి రెండోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడయ్యారు. ఈ పదవిలో ఉండగానే ఆయన మృతి చెందారు.

- అనంతరాములు మృతితో ఆయన సోదరుడైన డాక్టర్ మల్లు రవి రాజకీయ రంగప్రవేశం చేశారు. 1981లో కాంగ్రెస్ అభ్యర్థిగా నాగర్‌కర్నూలు లోక్‌సభ నియోజకవర్గం, 1998లో అక్కడి నుంచే రెండోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డితో రవికి సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేశారు. అంతేకాక ఆయనకు ప్రభుత్వ విప్ పదవి కూడా దక్కింది.



మల్లు రవి

- మల్లు అనంతరాములు మరో సోదరుడైన మల్లు భట్టివిక్రమార్కకు మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. 2007లో జరిగిన ఎన్నికల్లో ఆయన స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2009 సాధారణ ఎన్నికల్లో మధిర నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. వైఎస్ కేబినేట్‌లో చీఫ్ విప్‌గా, అటు తర్వాత డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ఇక 2014, 2018 ఎన్నికల్లోనూ గెలిచిన భట్టి ప్రస్తుత ఎన్నికల్లో మరోమారు పోటీపడుతున్నారు.



మల్లు భట్టి విక్రమార్క

గండగలపాడు నుంచి..



బోడేపుడి వెంకటేశ్వరరావు


మండలంలోని గండగలపాడుకు చెందిన సీపీఎం నేత బోడేపుడి వెంకటేశ్వరరావు మధిర నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. 1985, 1989, 1994 ఎన్నికల్లో గెలిచిన బోడెపూడి.. శాసనసభలో రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు. 1989లో అసెంబ్లీలో సీపీఎం శాసనసభాపక్షనేతగా ఎన్నికయ్యారు. రైతులకు గిట్టుబాటు ధర, సాగునీటి సమస్య తదితర అంశాలను అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కార మార్గాలు చూపడం ద్వారా రైతు బాంధవుడిగా పేరు సాధించారు. 1997 ఆగస్టు 5న ఆయన కన్నుమూశారు. ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో మధిర నియోజకవర్గానికి వైరా రిజర్వాయర్ నుంచి రక్షిత మంచినీటిని అందించే పథకాన్ని మంజూరు చేయించారు. అయితే, ఆ ప్రాజెక్టు పూర్తి కాకముందే బోడేపుడి కన్నుమూయడం, ప్రభుత్వం ఈ పథకానికి బోడేపుడి సుజల స్రవంతి పథకంగా పేరు పెట్టింది. ప్రస్తుతం ఈ పథకం ద్వారా 107 గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీరు అందింది.

వైరా నుంచి ‘బండారు’




బండారు ప్రసాదరావు

వైరాకు చెందిన బండారు ప్రసాదరావు 1978లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మధిర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి శీలం సిద్దారెడ్డి, జనతా పార్టీ అభ్యర్థి మద్దినేని నర్సింహారావుపై విజయం సాధించారు. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వైరాలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయించారు.



కొండబాల కోటేశ్వరరావు

సోమవరం వాసి..



కొండబోలు వెంకయ్య

మండలంలోని సోమవరానికి చెందిన కొండబోలు వెంకయ్య 1952లో మధిర ఎమ్మెల్యేగా పీడీఎఫ్ తరపున గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన మాడపాటి రాంచంద్రరావుపై విజయం సాధించారు. మాడపాటి హనుమంతరావు, సర్దార్ జమలాపురం కేశవరావు ఈయన సహచరులు. 1936లోనే కమ్మ హాస్టల్ నిర్మాణానికి కృషి చేశారు. అనంతరం వైరాలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి 1953లో ఆంధ్రనికేతన్ హైస్కూల్‌గా మార్చారు. వైరా సహకార సంఘం అధ్యక్షుడిగానూ పనిచేసిన ఆయన రైతాంగ ప్రయోజనాల కోసం, సాగునీటి సౌకర్యాల అభివృద్ధికి కృషిచేశారు. ఆయన వారసులు వైరాలో కొండబోలు వెంకయ్యచౌదరి(కేవీసీఎం) మెమోరియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు.

కొండకొడిమ నుంచి కొండబాల

మండలంలోని కొండకొడిమకు చెందిన కొండబాల కోటేశ్వరరావు 1999లో మధిర నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. 1970లో సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన పీజీ చదువుతూ రెండోసారి కూడా ఎన్నికయ్యారు. ఎల్‌ఎంబీ డైరెక్టర్‌గా పనిచేశాక, సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ పదవి నిర్వర్తించారు. కొంతకాలం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్‌గా పనిచేశారు. తొలుత శీలం సిద్దారెడ్డి అనుచరుడిగా రాజకీయాల్లోకి వచ్చినా తర్వాత టీడీపీలో చేరగా, ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉంటూ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

గుర్తుల గుర్తుంచుకో రామకా..!

ఎన్నికల ప్రచారంలో పాటల జోష్
- మేనిఫెస్టోతో పాటు అభ్యర్థులను కీర్తిస్తూ పాటలు
- సినిమా పాటల పేరడీలకు స్థానం
- రచయితలు, గాయకులకు ఉపాధి కల్పిస్తున్న ప్రచారం

ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఉదయం మొదలు రాత్రి నిద్రపోయే వరకు వాడవాడనా అభ్యర్థుల ప్రచారం హోరెత్తుతోంది. ఇందులో పాటలు, కళారూపాలు ప్రధానపాత్ర పోషిస్తుండగా.. బహిరంగ సభల్లో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. అయితే, పార్టీల మేనిఫెస్టోలోని వివరాలతో పాటు పోటీకి దిగిన అభ్యర్థుల గుణగణాలను కీర్తిస్తూ కళాకారులు పాడుతున్న పాటలు ప్రచారంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇందుకోసం అభ్యర్థులు సొంతంగా పాటలు రాయించి పాడించగా.. మరికొందరు పార్టీ తరఫున వచ్చిన పాటలతో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. – ఖమ్మంగాంధీచౌక్

పాటల్లో కొన్ని..

నడువు నడువు నడువవే రామకా.. కలిసి నడుం కట్టవే రామకా.. గుర్తుల గుర్తుంచుకో రామకా.. తదితర పాటలు ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ పాటను తొలుత బీఆర్ఎస్ నాయకులు విడుదల చేయగా మరికొన్ని పార్టీలు కూడా అనుసరించగా.. ఇంకొందరు పేరడీగా పాడిస్తున్నారు. ఓటరన్నా.. ఓటెయ్య మరువకన్నా, మంచోళ్లకేస్తే ఓటు.. నీకుండదసలు లోటు.. అంటూ బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి పాట బాణీలో రూపొందించిన గేయం కూడా ఆకట్టుకుంటోంది. అలాగే, గిరిజన ప్రాంతాల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు బంజారా భాషలోనే రూపొందించిన ఆడాల మోడాల గాడీ.. చాలియారీ గాడీ.. తదితర పాటలు పాడుతూ ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు. అన్నింటి కన్నా ఎక్కువగా తెలంగాణ భాష, యాసలో ఉన్న పాటలు, తెలంగాణ ఉద్యమ పాటలను ప్రాచుర్యం పొందిన పాటలను ఎక్కువగా వినియోగిస్తున్నారు.


ఇటీవల ఓ ప్రచార సభలో పాట పాడుతూ నృత్యం చేస్తున్న కళాకారులు

కళాకారులకు ఉపాధినిస్తున్న ఎన్నికలు

ఎన్నికల ప్రచారం కళాకారులకు ఉపాధిగా మారింది. గాయనీ, గాయకులకు పాడినందుకు.. రచయితలకు రాసినందుకు పారితోషికం చెల్లిస్తున్నారు. మరోపక్క రికార్డింగ్, బాణీ కట్టినందుకు ఈవెంట్ ఆర్గనైజర్లు ఒప్పందం చేసుకుని సీడీలు రూపొందిస్తున్నారు. అలాగే, కోలాటాలు, డప్పు నృత్యాలు చేసే వారికి సైతం రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు డిమాండ్ ఆధారంగా చెల్లిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అభ్యర్థులే కాక పొరుగున ఉన్న నల్లగొండ, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల అభ్యర్థుల కోసం ఖమ్మంలో పాటల సీడీలు సిద్ధం చేసినట్లు కళాకారులు చెబుతున్నారు.

పేరడీలు.. జానపదాలు

ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తమకు అనుకూలమైన పాటలను ప్రజలు మెచ్చేలా పేరడీ చేయించి స్టూడియోల ద్వారా రికార్డు చేయించారు. వీటిని గాయనీ, గాయకులతో పాడించి ప్రచార రథాల్లో వినియోగిస్తున్నారు. కొందరు జానపద గాయకులు తమ బాణీలో, పల్లె పదాలతో అభ్యర్థుల ప్రచారానికి ఉపయోగపడేలా పాటలు రాసి పాడుతున్నారు.

మాకు ఉపాధి లభిస్తోంది..



ఎన్నికల్లో అభ్యర్థుల తరఫున పాటలు పాడుతున్నాను. గాయకులు పాటలు రాయగా, అభ్యర్థుల సూచన మేరకు బాణీ కట్టి పాడతాం. ఖమ్మం, హైదరాబాద్ జిల్లాలోని పలు పార్టీల అభ్యర్థులు మమ్ముల్ని సంప్రదించడంతో ఉపాధి లభించినట్లయింది.
– కొమ్ము రమ, గాయని, సుబ్లేడు

పాట రాస్తా.. పాడుతా



వంశపారంపర్యంగా పాటలు రాయడంతో పాటు పాడుతున్నాం. గ్రామీణ, జానపద పాటలు ఎక్కువగా పాడతాం. అప్పటికప్పుడు బాణీ కట్టడం అలవాటు. తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గొన్నా. పార్టీల అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్లకూ పాటలు పాడాను. – నూకపొంగు వెంకయ్య, గుడిమళ్ల, ఖమ్మం రూరల్

సాంస్కృతిక కార్యక్రమాన్ని రూపొందిస్తా..



అభ్యర్థుల ప్రచారానికి సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. సినిమా పాటలు పేరడీ చేయడం, జానపద పాటలను ప్రచారానికి అనుగుణంగా మార్చడమే కాక ప్రచారానికి స్కిట్లు రూపొందిస్తున్నాం. ఇప్పటికే పలువురికి పాటలు రాసి పాడించాం.
–మొగిలి గుణాకర్, ఈవెంట్ ఆర్గనైజర్, ఖమ్మం

వేదికగా నిలుస్తున్నాం..



పాటల రచయితలు, గాయకులకు మా స్టూడియో వేదికగా నిలుస్తోంది. పలువురు సొంతంగా పాటలు రాసి మా స్టూడియోలో రికార్డు చేసి అభ్యర్థులు ఇస్తున్నారు. ఇంకొందరు అభ్యర్థులు నేరుగా మమ్ముల్ని సంప్రదిస్తే కళాకారుల సహకారంతో రికార్డింగ్ చేస్తున్నాం.
–నందిగామ రాజ్‌కుమార్, ఎస్ 7 స్టూడియో, ఖమ్మం

పాటే ప్రాణం.. ఉపాధి



పాటే మా ప్రాణం. పాట పాడితే పూట గడుస్తది. మిగతా సమయాలతో పోలిస్తే కళాకారులకు ఎన్నికల వేళ ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. ఇప్పటివరకు ఎనిమిది మంది అభ్యర్థులకు పాటలు రాసి ఇచ్చా. మా బృందంతో కలిసి ప్రదర్శనలూ ఇస్తున్నాం.
–పుట్టబంతి నర్సింహారావు, గాయకుడు, సూర్యాపేట జిల్లా

ఓటు అభ్యర్థిస్తే.. ఉద్యోగం ఊస్ట్



వైరా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా ఉద్యోగానికి ఎసరొచ్చే ప్రమాదం పొంచి ఉంది. స్నేహితులో, బంధువులో పోటీలో ఉన్నారని వారి తరఫున ప్రచారం చేస్తే వేటు పడుతుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల సంఘమే అన్నీ తానై పరిపాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు విధులకు పరిమితం కావాలే తప్ప.. ఏ రాజకీయ పక్షానికి కొమ్ము కాయొద్దని సూచిస్తున్నారు. నేరుగా ప్రచా రం చేసినా... సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసినా చర్యలు తీసుకుంటారు. అలాగే, రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే సమావేశాలకు హాజరుకావడం, ఇష్టారీతిగా మాట్లాడడం, ప్రభుత్వ పథకాలపై వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే ప్రభుత్వ ఉద్యోగులపై కఠినచర్యలు తీసుకుంటారు.

తాయిలాల ఆశతో లాక్కుంటున్నారు..

- అయినా నా వెంటే ఖమ్మం ప్రజలు
- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: జనబలం లేకపోయేసరికి కాంగ్రెస్ అభ్యర్థికి ఏం చేయాలో తోచక తాయిలాల ఆశ చూపి తమ పక్కన ఉన్న వారిని లాక్కుంటున్నారని ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో జరిగిన ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటి ప్రచారం, రోడ్డు షోల్లో పువ్వాడ మాట్లాడారు. తాయిలాల ఆశతో కొందరు వెళ్లినా, ప్రజలు మాత్రం తన వెంటే ఉన్నారని తెలిపారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థికి పదవి వస్తే ఆయనకే అలంకారంగా మారుతుందని, కానీ తనకు పదవి వస్తే ఖమ్మంకు అలంకారంగా ఉంటుందని చెప్పారు. ఈ నాలుగేళ్లలో ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని తెలిపారు. అధికారులను వెంట బెట్టుకుని గల్లీగల్లీ తిరిగి ప్రజాసమస్యలు గుర్తించడమేకాక పరిష్కరించానని, మౌలిక వసతులు కల్పనకు కృషి చేశానని వివరించారు. అదే తుమ్మల మంత్రిగా ఉన్నప్పుడు ఖమ్మంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసిన తుమ్మల లకారంను మురికికూపంగానే ఉంచినా, తాను మాత్రం మణిహారంగా తీర్చిదిద్దానని పువ్వాడ వివరించారు. అన్ని అంశాలను ప్రజలు బేరీజు వేసుకుని మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని అజయ్‌కుమార్ కోరారు. బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, నాయకులు సన్నీ పఠాన్, దోన్వాన్ శ్రీను, మెంతుల శ్రీశైలం, సున్నా మాధవరావు, నామవరపు ఈశ్వర్, నాగ్‌నాయక్, షకీనా, నరేష్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పువ్వాడ

ఇంటింటి ప్రచారం..

నగరంలోని పలు డివిజన్లలో పువ్వాడ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతులు పట్టి మరోసారి విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఈక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా, పింఛన్ వస్తోందా, కల్యాణలక్ష్మి అందిందా, లేదా అని ఆరా తీసిన పువ్వాడ.. తనకు మరోమారు గెలిపించాలని కోరారు.

జంగ్ తెలంగాణ

క్లుప్తంగా

ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక


మాధవరావు, అధ్యక్షుడు


వరప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి

ఖమ్మం సహకారనగర్: ఎస్ టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.కరుణాకర్‌రెడ్డి సమక్షాన ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా వేముల మాధవరావు, ప్రధాన కార్యదర్శి దొడ్డా వరప్రసాదరావుతో పాటు పలువురితో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ మొదలయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగేలా హైకోర్టులో వాదనలు వినిపించాలన్నారు. ఈసమావేశంలో సంఘం బాధ్యులు పలువురు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పాండురంగాపురం(విద్యానగర్‌కాలనీ)కి చెందిన ఎ.నాగలక్ష్మిపై పాత కక్షల నేపథ్యాన దాడి చేసిన నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. ఈనెల 16న నాగలక్ష్మి తన ఇంటిని శుభ్రం చేయగా నీళ్లు తమ ఇంటికి ముందుకు వచ్చాయంటూ పక్క ఇంటికి చెందిన సత్యనారాయణ, సుగుణ, చిన్నబాబు, మమత పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని దాడి చేశారు. తనతో పాటు తల్లిపై దాడి చేయడమే కాక చంపుతామని బెదిరించారని నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కూసుమంచి: కుటుంబీకులతో జరిగిన గొడవ కారణంగా మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పూరియాతండాకు చెందిన బానోత్ శ్రీను(45)కు ఈనెల 16న తన భార్య, కుమారుడితో గొడవ కావడంతో క్షణికావేశంలో పురుగుల మందు తాగగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీను గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

ఖమ్మం స్పోర్ట్స్: ప్రజలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఖమ్మం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్‌సురభి పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం వాకర్లు, క్రీడాకారులకు ఓటుహక్కుపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విలువైన ఓటు వేసే సమయాన ప్రలోభాలకు గురికావొద్దని కోరారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఎపిక్ కార్డు రానివారు ఇతర గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే ఓటు వేయొచ్చని చెప్పారు. అనంతరం 'మేము తప్పక ఓటు వేస్తాం' అంటూ రూపొందించిన ప్రచార ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె.శ్రీరాం, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, తహసీల్దార్ సీహెచ్.స్వామి పాల్గొన్నారు.



ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న డీసీ మల్లీశ్వరి, పక్కన కమిషనర్ ఆదర్శ్‌సురభి తదితరులు

25లోగా పనులు పూర్తి చేయండి

'మన ఊరు – మన బడి'పై సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 'మన ఊరు–మన బడి' ద్వారా పనులు చేపట్టగా, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసిన పాఠశాలల్లో పనులను ఈనెల 25 లోగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 251 పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశామని, 99 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా చోట్ల కూడా వేగం పెంచి ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

డెంగీ నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లాలో డెంగీ కేసులను నియంత్రించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనవరి నుండి ఇప్పటివరకు 465 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. అయితే, డెంగీ నిర్ధారణ కాగానే బాధితులకు చికిత్స అందిస్తూనే, వారి ఇళ్లతో పాటు చుట్టుపక్కల వారికి కూడా పరీక్షలు చేయడం ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇళ్లలోనే కాకుండా పరిసరాల్లోనూ మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. యాంటీ లార్వా కార్యాచరణ, ఆయిల్ బాల్స్ వేయడంపై కలెక్టర్ సూచనలు చేశారు. ఈసమావేశాల్లో డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్ఓ బి.మాలతి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ హరికిషన్, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, అధికారులు సైదులు, చంద్రమౌళి, కృష్ణలాల్, శ్యాంప్రసాద్, హేమలత, నాగేషు పాల్గొన్నారు.


వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

సొసైటీ బలోపేతానికి కృషిచేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేసేలా సభ్యులు కృషి చేయాలని చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు కోరారు. ఖమ్మంలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కనీసం 500 మంది సభ్యులను చేర్పించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. అలాగే, మేనేజింగ్ కమిటీ సభ్యులు గ్రామీణప్రాంతాలకు వైద్యసేవలను విస్తరింపచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ బాధ్యులు సాదినేని జనార్దన్‌రావు, సూర్యప్రకాశరావు, గోవర్ధన్, నరసయ్య, సత్యనారాయణరెడ్డి, శ్రీహరి, నాగేశ్వరావు, వీరభద్రం, ఆంజనేయులు, తాతా రాఘవయ్య, ఉపేందర్‌రావు, గణపతి, మోహన్, పుల్లారావు, పుల్లారావు, ఉప్పలయ్య, ఉపేందర్‌రెడ్డి, టి.జనార్దన్‌రావు, హరినాథబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ చంద్రమోహన్

గుండె బాధితుడి ప్రాణాలు నిలిపిన వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయ స్థితికి చేరిన వ్యక్తికి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ప్రాణం పోశారు. కొత్తగూడెంకు చెందిన వెంకటేశ్వర్లు(65) గతంలో జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు, కుడి చేయి కోల్పోయాడు. ఆతర్వాత గుండె సంబంధిత సమస్యతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. గత మంగళవారం ఆయన ఆస్పత్రిలో చేరగా, కార్డియాలజిస్ట్ సీతారామ్ ఆధ్వర్యాన రెండు స్టంట్లు వేశారు. అప్పటి నుంచి పర్యవేక్షిస్తూ చికిత్స చేయడంతో కోలుకున్న వెంకటేశ్వర్లును శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ సదరు వ్యక్తి ఆరోగ్యం అత్యంత విషయంగా మారగా మెరుగైన చికిత్స నిర్వహించామని తెలిపారు. ఈ ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, డాక్టర్ అమర్‌సింగ్ తదితరులు డాక్టర్ సీతారామ్, సిబ్బందిని అభినందించారు.


చికిత్సపై ఆరా తీస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, అధికారులు


పోల్ చీటీతో పాటే ఎన్నికల సూచిక



ఎన్నికల సంఘం ఇస్తున్న బుక్‌లెట్

నేలకొండపల్లి: ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై ఎన్నికల సంఘం రకరకాల మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా ఈసారి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ ఎన్నికల గైడ్ పేరుతో చిన్న పుస్తకం కూడా ఇస్తున్నారు. ఇందులో ఓటు హక్కు నమోదు, ఓటింగ్ ప్రక్రియ ఎలా ఉంటుంది, జాబితాలో పేరు ఉందా లేదా అనేది తెలుసుకోవడం ఎలా, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు ఎలా చేయాలో పొందుపరిచారు. అంతేకాకుండా ఓటు హక్కు కలిగిన వారందరూ వినియోగించుకోవాలని సూచించారు.

పోస్ట్ ద్వారా ఓటరు గుర్తింపు కార్డుల బట్వాడా




ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఓటర్లకు ఎన్నికల సంఘం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను తపాలా శాఖ బట్వాడా చేస్తోంది. కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో పాటు మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి ఎన్నికల సంఘం ఫొటో గుర్తింపు కార్డు(ఎపిక్)లు విడుదల చేసింది. ఈ కార్డులను ఏప్రిల్ నుంచి బట్వాడా చేస్తున్నా, ఈనెలలో మాత్రం పెద్ద సంఖ్యలో కార్డులు చేరవేస్తున్నామని ఖమ్మం డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 1.50 లక్షలు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 70వేల గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈనెలలోనే ఉమ్మడి జిల్లాకు చెందిన 73వేల మందికి కార్డులు పంపిణీ చేశామని, ఎన్నికల నాటికి మరో 30వేల కార్డులు చేరవేస్తామని తెలిపారు.

రూ.2.33 లక్షల నగదు సీజ్

- నకిలీ బంగారు బిస్కెట్లు, కాయిన్లు కూడా..

కొణిజర్ల: సరైన పత్రాలు లేకుండా కారులో తీసుకెళ్తున్న రూ.2.33లక్షల నగదుతో పాటు 90 నకిలీ బంగారు బిస్కెట్లు, కాయిన్లను కొణిజర్ల పోలీసులు సీజ్ చేశారు. కొణిజర్లలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టగా ఏపీకి చెందిన ఓ వ్యక్తి కారులో కూడా పరిశీలించారు. ఇందులో రూ.2.33 లక్షల నగదుతో పాటు 45 బిస్కెట్ల రూపంలోని నకిలీ బంగారు బిళ్లలు, మరో 45 నకిలీ గోల్డ్ కాయిన్లు లభించగా సీజ్ చేసినట్లు ఎస్సై జె.శంకర్‌రావు తెలిపారు.


నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

బోనకల్‌లో రూ.1.69లక్షలు..

బోనకల్: బోనకల్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా కారులో తీసుకెళ్తున్న రూ.1,69,500 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. వాహన తనిఖీలో భాగంగా చెక్‌పోస్ట్ వద్ద వత్సవాయి నుంచి ఖమ్మం వెళ్తున్న ఇద్దరి వద్ద నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

లారీలో తీసుకెళ్తున్న వరిగడ్డి దగ్ధం

కూసుమంచి: మండలంలోని పాలేరు – జుజుల్‌రావుపేట రహదారిలో శివాజీ మిల్లు వద్ద లారీలో తీసుకెళ్తున్న వరిగడ్డికి విద్యుత్ తీగలు తాకడంతో మంటలు అంటుకుని కాలిపోయింది. సూర్యాపేట జిల్లా మోతె మండలం అన్నారుగూడెం నుండి ఏపీలోని గుంటూరు జిల్లాకు గడ్డిని లారీలో శుక్రవారం తరలిస్తున్నారు. లారీ మిల్లు వద్దకు వచ్చే సరికి విద్యుత్ తీగలు తాకి షార్ట్‌సర్క్యూట్ జరగడంతో 300 మోపుల గడ్డి పూర్తిగా కాలిపోగా, లారీ సైతం పాక్షికంగా దగ్ధమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు.

ప్రజల పక్షాన నిలిచేది కాంగ్రెస్సే..

- మా విజయాన్ని ఎవరూ ఆపలేరు
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కామేపల్లి: నిత్యం ప్రజల పక్షానే కాంగ్రెస్ ఉంటుందని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల పాలన రావాలనేది తమ ఆకాంక్ష అని తెలిపారు. కామేపల్లి మండలం ఊట్కూర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారని ఉన్నందునే ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇదే ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉందని, ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో 72–76 సీట్లు గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు గెలవబోతున్నామని తెలిపారు. కాగా, సీఎం కేసీఆర్ తిట్లే తమకు ఆశీర్వాదమని చెప్పారు. ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేసి తన గెలుపులో భాగస్వాములు కావాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో ఆదరణ కోల్పోయినందున ఆ పార్టీ నేతల మాటలను ప్రజలు నమ్మే స్థితి లేరన్నారు. అనంతరం గోవింద్రాల ఎంపీటీసీ లకావత్ సునీత, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరాంనాయక్, మాజీ ఎంపీటీసీ దొడిగర్ల సుందరం తదితరులతో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా పొంగులేటి కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు మువ్వా విజయబాబు, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, ఏపూరి మహేందర్, పుచ్చకాయల వీరభద్రం, గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, కోడెం సులోచన, ఏపూరి హేమమాలిని, బొడ్డు లక్ష్మీనారాయణ, ఏపూరి బ్రహ్మం, లతాదేవి పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి, కనకయ్య, నాయకులు



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్ దంపతులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



కుటుంబ సభ్యులతో జస్టిస్ వినోద్ కుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

19న తిరుమలలో పుష్పయాగం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19న పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. 19న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ, 19న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.



ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

నా ఎస్సీ.. నా ఎస్టీ.. నా బీసీ.. నా మైనార్టీ పదాలకు అర్థం చెబుతూ..

34 లక్షల ఎకరాలపై పేదలకు హక్కులు

- చరిత్రను తిరగరాస్తూ సామాజిక భూ హక్కులు
- నూజివీడు బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్
- దశాబ్దాల అనుభవదారులను చట్టబద్ధంగా హక్కుదారులను చేశాం
- ఇది చరిత్రలో గొప్పగా నిలిచిపోయే రోజు
- 42,307 మందికి కొత్తగా 46,463.82 ఎకరాల డీకేటీ పట్టాల పంపిణీ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములపై పేదలకు సర్వ హక్కులు కల్పిస్తోంది మీ బిడ్డ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలు, రైతుల గుండె చప్పుడు విన్నది కాబట్టే మనందరి ప్రభుత్వం దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వారికి భూములపై పూర్తి హక్కులు కల్పిస్తూ మనస్ఫూర్తిగా మంచి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35,44,866 ఎకరాలకు సంబంధించి 20,24,709 మంది పేదలకు హక్కులు కల్పించి ఆ భూములను మీ బిడ్డ ప్రభుత్వం వారి చేతుల్లో పెడుతోందన్నారు. మనందరి ప్రభుత్వంలో సామాజిక న్యాయమన్నది ఒక నినాదంగా కాకుండా ఒక విధానంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేద వర్గాలను అక్కున చేర్చుకుని సామాజిక, ఆర్థిక న్యాయం చేయగలిగామన్నారు. ప్రతి పేదవాడు కాలర్ ఎగరవేసి అదిగో మా అన్న ప్రభుత్వం.. మా ప్రభుత్వం.. మా కోసం ఆలోచన చేసేవాడు ఒకడు ఉన్నాడు అని చెప్పుకునే విధంగా పాలన సాగిందని చెప్పేందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46,463.82 ఎకరాల భూమిని 42,307 మందికి కొత్తగా డీకేటీ పట్టాలు పంపిణీ చేసే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దశాబ్దాలుగా అనుభవదారులుగా ఉన్న పేద రైతులకు అసైన్డ్ భూములపై హక్కులు కల్పించడంతోపాటు చుక్కల భూముల సమస్యకు సైతం పరిష్కారాన్ని చూపామన్నారు. దళితుల శ్మశాన వాటికల కోసం 1,563 గ్రామాల్లో 951 ఎకరాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. 2003 నాటి అసైన్డ్ భూములపై హక్కులు, కొత్తగా డీకేటీ పట్టాలను అందిస్తూ పేదలకు వెన్నుదన్నుగా నిలుస్తుంటే పెత్తందారులకు నచ్చడం లేదని మండిపడ్డారు. పేద వర్గాల పట్ల బాధ్యతగా, చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంటే ప్రతిపక్షం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో నిరుపేదలకు భూ పంపిణీ, అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు, లంక భూములకు పట్టాలు, చుక్కల భూములు, షరతు గల పట్టా భూములు, సర్వీస్ ఈనాం భూములు 22 (ఏ) నుంచి తొలగింపు, భూమి కొనుగోలు పథకం ద్వారా అందించిన భూములపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. భూములకు సంబంధించి కేవలం 53 నెలల వ్యవధిలో తీసుకున్న తొమ్మిది రకాల విప్లవాత్మక నిర్ణయాలతో పేదలు, రైతన్నలకు చేకూర్చిన మేలును వివరిస్తూ ఆయా అంశాలను సీఎం జగన్ ప్రస్తావించారు.



లబ్ధిదారుకు భూ పట్టా అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ప్రపంచంలోనే అతి పెద్దది..

ఏపీలో ఎలక్ట్రిక్ వాహన యూనిట్

- జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రకటన
- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం.. పుంగనూరులో యూనిట్
- రూ.4,640 కోట్ల పెట్టుబడి.. 8,080 మందికి ఉపాధి
- ఈ నెలాఖరులో పనులు ప్రారంభం.. 2025కి వాణిజ్య ఉత్పత్తి మొదలు




సాక్షి, అమరావతి: జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రపంచంలోనే అతిపెద్ద తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తోంది. చైనా వెలుపల ఈ స్థాయిలో భారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదిరినట్లు పెప్పర్ మోషన్ జీఎంబీహెచ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భారీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా పుంగనూరులో 800 ఎకరాలు కేటాయించడంతో పాటు పలు రాయితీలను ఇచ్చింది. సుమారు రూ.4,640 కోట్లు (600 మిలియన్ అమెరికన్ డాలర్లు) పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 8080 మందికి ఉపాధి లభిస్తుంది. టెస్లా మాదిరి అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత ఎలక్ట్రిక్ బస్ అండ్ ట్రక్ తయారీ యూనిట్‌తో పాటు డీజిల్ బస్సులు, ట్రక్కులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రిట్రో ఫిట్టింగ్, 20 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉండే బ్యాటరీ తయారీ యూనిట్, విడిభాగాల తయారీ యూనిట్లు కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. పరిశ్రమలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహం, ఆయన తీసుకుంటున్న ప్రగతిశీల ఆర్థిక విధానాలకు తోడు పోర్టులు, పారిశ్రామిక మౌలిక వసతులు పెద్ద ఎత్తున సమకూరుస్తుండటంతో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు పెప్పర్ మోషన్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆండ్రియాస్ హేగర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

2025 నాటికి ఉత్పత్తి ప్రారంభం

ఈ నెలాఖరులో యూనిట్ నిర్మాణం ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది. 2025 ప్రారంభం నాటికి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. 2027 నాటికి ఏటా 50,000 కంటే ఎక్కువ బస్సులు, ట్రక్కులు తయారు చేసే సామర్థ్యానికి యూనిట్ చేరుకుంటుందని వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలను కూడా ఇక్కడే ఉత్పత్తి చేసి, అంతర్జాతీయంగా సరఫరా చేయనున్నట్లు తెలిపింది.

బోగస్ ఇన్వాయిస్‌లతో 'స్కిల్' నిధులు స్వాహా

- చంద్రబాబు సన్నిహితుడు యోగేశ్ గుప్తానే పాత్రధారి
- ఆయన చెబితేనే వాటిని ఇచ్చా..
- పూర్తి కుట్రను వెల్లడిస్తా.. అప్రూవర్‌గా అనుమతించండి
- న్యాయస్థానంలో ఏసీఐ ఎండీ చంద్రకాంత్ షా పిటిషన్
- స్కిల్ కుంభకోణం కేసులో కీలక మలుపు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని కొల్లగొట్టిన 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' కుంభకోణం కేసు కీలకమలుపు తిరిగింది. షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా చంద్రబాబు ముఠా అడ్డగోలుగా నిధులను అక్రమంగా తరలించారన్నది స్పష్టమైంది. ఈ బాగోతంలో కీలక పాత్రధారిగా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా మొత్తం అవినీతి నెట్‌వర్క్‌ను వెల్లడిస్తూ వాంగ్మూలం ఇచ్చారు. స్కిల్ స్కాం కేసులో నిందితుడు (ఏ–13)గా ఉన్న ఆయన తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ స్కాంలో బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా నిధులను ఎలా కొల్లగొట్టిందీ వివరిస్తూ ఆయన గతంలోనే గుంటూరులోని న్యాయస్థానంలో 2022, జులై 23న 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చారు. తాజాగా.. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారి స్కిల్ స్కాంలో సూత్రధారులు, పాత్రధారులు, తెరవెనుక కుట్రను వెల్లడించేందుకు ఆయన స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అందుకోసం తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించి తనను ఈ కేసులో సాక్షిగా పరిగణించాలని కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో చంద్రకాంత్ షాను సీఐడీ గతంలో అరెస్టుచేయగా ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు.

యోగేశ్ గుప్తానే కథ నడిపారు..

ఇక ఈ కేసులో చంద్రబాబు సన్నిహితుడు యోగేశ్ గుప్తా పాత్ర మరోసారి బయటకొచ్చింది. అమరావతిలో తాత్కాలిక సచివాలయ భవనాలు, టిడ్కో ప్రాజెక్టు కాంట్రాక్టుల కేటాయింపులో నిర్మాణ సంస్థల నుంచి ముడుపులు వసూలుచేసి చంద్రబాబుకు చేరవేయడంలో యోగేశ్ గుప్తా పాత్రధారిగా ఉన్నారు. అందుకే ఈయనకు ఐటీ శాఖ కూడా నోటీసులిచ్చి విచారించింది. అలాగే, స్కిల్ స్కాం కేసులోనూ యోగేశ్ గుప్తా నిందితుడుగా (ఏ–22) ఉన్నారు. నిధుల అక్రమ తరలింపులో ఈయన కీలకపాత్ర పోషించారని చంద్రకాంత్ షా తన అప్రూవర్ పిటిషన్‌లో వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడు సావన్ కుమార్ జజూ (ఏ–26)తో కలిసి యోగేశ్ గుప్తా 2016లో ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షాను సంప్రదించారు. డిజైన్‌టెక్, స్కిల్లర్ కంపెనీలకు సాఫ్ట్‌వేర్ సమకూర్చినట్లు.. ఐటీ సేవలు అందించినట్లుగా బోగస్ ఇన్వాయిస్‌లు కావాలని కోరారు. అనంతరం.. ఏసీఐ కంపెనీ పేరిట స్కిల్లర్ కంపెనీకి 18 బోగస్ ఇన్వాయిస్‌లు, డిజైన్‌టెక్ కంపెనీకి రెండు బోగస్ ఇన్వాయిస్‌లు ఇచ్చారు. సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఒప్పందం కుదుర్చుకున్నట్లు.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు నమ్మించేందుకే బోగస్ ఇన్వాయిస్‌లు తమ నుంచి తీసుకున్నట్లు తాను గుర్తించానని చంద్రకాంత్ షా పేర్కొన్నారు. ఈ బోగస్ ఇన్వాయిస్‌ల విలువ మేరకు రూ.64,87,39,313 ఏసీఐ కంపెనీ బ్యాంకు ఖాతాలో జమచేశారు. అనంతరం సావన్‌కుమార్ చెప్పిన పలు షెల్ కంపెనీలకు ఆ నిధులను చంద్రకాంత్ షా బదిలీ చేశారు. మరోవైపు.. స్కిల్ స్కాం నిధులు రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు సీఐడీ తాజాగా గుర్తించింది. ఇందులో రూ.64.87 కోట్లు ఏసీఐ కంపెనీ బోగస్ ఇన్వాయిస్‌లతోనే అక్రమంగా తరలించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. చంద్రకాంత్ షా అప్రూవర్ పిటిషన్‌పై విచారణకు డిసెంబర్ 5న హాజరుకావాలని న్యాయస్థానం ఆయన్ని ఆదేశించింది. దాంతో స్కిల్ స్కాం దర్యాప్తులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జిల్లా వార్తలు

ఖమ్మం మార్కెట్‌లో గుంటూరు బృందం



గుంటూరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఖమ్మం ప్రతినిధులు


ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటల కొనుగోళ్ల తీరుతెన్నులను గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. ఖమ్మం మార్కెట్‌లో పత్తి, అపరాల పంటల కొనుగోళ్లకు ఈ–నామ్ విధానాన్ని అమలుచేస్తున్నారు. మిర్చి కొనుగోళ్లలో కూడా కొంత మేరకు అమలుచేస్తుంగా, గేట్ ఎంట్రీ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, తూకం, ఎగుమతులను పరిశీలించేందుకు గుంటూరు మార్కెట్ ప్రతినిదులు వచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మం అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలు తెలుసుకున్నారు. గుంటూరు మార్కెట్ అధ్యక్షుడు నిమ్మకాయల రాజనారాయణ, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు రాజాబాబు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకటరెడ్డి, వ్యాపారులు సాంబశివరావు, అప్పిరెడ్డి తదితరులు అక్కడి నుంచి రాగా, ఖమ్మం ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం వారికి వివరాలు వెల్ల డించారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలంతోపాటు జీ.వై.నరేష్, ఎడ్లపల్లి సతీష్, డి.నాగరాజు, మార్కెట్ అధికారులు బి.బజార్, ఎం.డీ.వజీరుద్దీన్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చింతకాని: మండలంలోని చినమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా మున్నేరు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టి, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఎర్ర జెండా నీడలో...!

- ఇల్లెందులో 11సార్లు కమ్యూనిస్టు పార్టీలకే దక్కిన విజయం
- ఎమ్మెల్యేలుగా ఇల్లెందు, టేకులపల్లి మండల వాసులే
- పునర్విభజనకు ముందు కారేపల్లి మండలానికి అవకాశం
- బయ్యారం, గార్ల మండలాలకు దక్కని ప్రాతినిధ్యం



భూగర్భ ఖనిజ సంపదకు పుట్టినిల్లయిన ఇల్లెందు నియోజకవర్గం రాజకీయంగా కూడా చైతన్యవంతమైనదనే పేరు సాధించింది. స్వాతంత్ర్యం సిద్ధించాక జరిమొదటిసారి ఎన్నికలు జరిగిన సమయం నుంచి ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉంది. నాటి నుంచి 1972 వరకు జనరల్ నియోజకవర్గంగా ఉన్న ఇల్లెందు 1978నుంచి ఎస్టీలకు రిజర్వ్ అయింది. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగగా.. ప్రస్తుతం 16వ సారి ఎన్నికలు జరగనున్నాయి. – ఇల్లెందురూరల్

ఎర్రజెండా పార్టీలదే ఆధిపత్యం

ఇల్లెందు నియోజకవర్గంలో అత్యధిక సార్లు ఎర్రజెండా పార్టీల అభ్యర్థులే విజయం సాధించారు. 1952లో ద్విసభ్య స్థానంగా ఉన్నప్పుడు సోషలిస్టు పార్టీ అభ్యర్థి ఊకే నాగయ్య, పీడీఎఫ్ అభ్యర్థి కే.ఎల్.నర్సింహారావు గెలిచారు. 1957లో కే.ఎల్ నర్సింహారావు పీడీఎఫ్ అభ్యర్థిగా, డి.నర్సయ్య కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. ఆ తర్వాత 1962లో కే.ఎల్ నర్సింహారావు సీపీఐ అభ్యర్థిగా, 1967లో జి.సత్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థిగా, 1972లో వంగ సుబ్బారావు కాంగ్రెస్ అభ్యర్థిగా, 1978లో చాపల ఎర్రయ్య సీపీఐ(ఎంఎల్) అభ్యర్థిగా, 1983, 85, 89, 1999, 2004లో గుమ్మడి నర్సయ్య సీపీఐ(ఎంఎల్) అభ్యర్థిగా గెలిచారు. ఇక 1994లో ఊకే అబ్బయ్య సీపీఐ నుంచి, 2009లో ఊకే అబ్బయ్య టీడీపీ తరఫున, 2014లో కోరం కనకయ్య కాంగ్రెస్ నుంచి 2018లో బానోత్ హరిప్రియ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అత్యధికంగా 11 సార్లు ఎర్రజెండా పార్టీల అభ్యర్థులు ఇక్కడ గెలిచారు. ద్విసభ ఎన్నికల జరిగిన సమయంలో ఒక పర్యాయం ఎర్ర జెండా పార్టీలు పూర్తి ఆధిపత్యం కనబర్చగా, మరోమారు కాంగ్రెస్ అభ్యర్థి కూడా ప్రాతినిధ్యం వహించారు.

పునర్విభజనలతో స్వరూపం మారినా..

ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గం తొలుత ఓరుగల్లు జిల్లాలో ఉండేది. ఆ తర్వాత జిల్లాల విభజనతో ఖమ్మం జిల్లాలోకి వచ్చింది. 2016లో జరిగిన జిల్లాల పునర్విభజనతో భద్రాద్రి కొత్తగూడెంలోకి చేరుకుంది. అయితే, నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో కొనసాగుతుంది. ఇల్లెందు, టేకులపల్లి భద్రాద్రి జిల్లాలో, కామేపల్లి ఖమ్మం జిల్లాలో, బయ్యారం, గార్ల మండలాలు మహబూబాబాద్ జిల్లాలో ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చాక తొలినాళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి 2008 వరకు ఇల్లెందు నియోజకవర్గంలో ఎర్రజెండా పార్టీలు అత్యధిక సార్లు విజయం సాధించినా ఆ తర్వాత ప్రభావం కోల్పోయాయి. ఇక 1952 నుంచి ఇల్లెందు ఎమ్మెల్యేలుగా ఇల్లెందు, టేకులపల్లి, కారేపల్లి మండలాల వారికే అవకాశం దక్కడం విశేషం.

తొలిసారిగా బరిలో..

ఈ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం ఇరవై మంది బరిలో ఉన్నారు. తొలిసారి బయ్యారం మండలం నుంచి ఓ మహిళ స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇక గార్ల, కామేపల్లి మండలాల నుంచి మాత్రం నేటికీ ఎవరూ పోటీ చేయకపోవడం గమనార్హం.

ఆ రెండింటికి దక్కని అవకాశం

నియోజకవర్గంలోని ఇల్లెందు, టేకులపల్లి మండల వాసులతోపాటు కారేపల్లి మండల అభ్యర్థులకే విజయాలు దక్కాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కారేపల్లి మండలానికి బదులు కామేపల్లిని చేర్చారు. అయినా విజయం మాత్రం ఇల్లెందు, టేకులపల్లి మండలాలనే వరిస్తోంది. నియోజకవర్గంలో మొదటి నుంచి నుంచి ఉన్న బయ్యారం, గార్ల మండలాల నుంచి ఇప్పటివరకు ఎమ్మెల్యేగా ఎవరికీ అవకాశం దక్కలేదు.

ఎంసీహెచ్‌లో నిలిచిన ఎయిడ్స్ పరీక్షలు

- సిబ్బందిని సరెండర్ చేయడంతో అంతరాయం
- కొత్త వారిని నియమిస్తేనే మళ్లీ మొదలు



ఎంసీహెచ్‌లో మూతబడిన పీపీటీసీటీ ల్యాబ్, ఐసీటీసీ సెంటర్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఐవీ పరీక్షలు నిలిచిపోయాయి. వారం క్రిం సెంటర్‌కు తాళం వేయగా టెస్టులు నిర్వహించడం లేదు. దీంతో గర్భిణులు, చిన్నారులు, మహిళలు పరీక్ష చేయించుకునేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో కలిపి రెండు చోట్ల ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించేందుకు ఐసీటీసీ కేంద్రాలు ఉన్నాయి. జనరల్ ఆస్పత్రిలోని కేంద్రంలోని సాధారణ వ్యక్తులకు, ఎంసీహెచ్‌లో ఆరోగ్య మహిళ పరీక్షలకు వచ్చే వారు, గర్భిణుల్లో అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారు. అనుమానిత కేసుల్లో అప్పుడే పుట్టిన శిశువుల నుండి రక్తనమూనా సేకరించి చెన్నైలోని ల్యాబ్‌కు పంపించాలి. అయితే, రక్త నమూనాలు పంపించడంలో నిర్లక్ష్యం వహించినట్లు తేలగా ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, కౌన్సిలర్ సీతారామలక్ష్మిని ఈ నెల మొదట్లో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి సరెండర్ చేశారు. అప్పటి నుంచి కొత్తవారిని నియమించకపోవడంతో ఎంసీహెచ్‌లో ఎయిడ్స్ టెస్టులు నిలిచిపోయాయి. ఫలితంగా అవసరమైన వారు జనరల్ ఆస్పత్రి పై అంతస్తుకు వెళ్లి నమూనాలు ఇవ్వాల్సి రావడం సమస్యగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి ఎంసీహెచ్‌లోని ఐసీటీసీ కేంద్రానికి సిబ్బందిని కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

అండర్–14 బాలబాలికల జట్ల ఎంపిక



బాలుర బాస్కెట్‌బాల్ జట్టు



బాలికల బాస్కెట్‌బాల్ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం బాలబాలికల అండర్–14 బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది క్రీడాకారులు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పాఠశాల క్రీడల కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, సేల్లా ప్రేమ్‌నిరంజన్ తెలిపారు. బాలుర జట్టుకు జె.జాస్టిన్, ఎ.హర్షిత్, కె.చరణ్‌నాయుడు, బి.విశ్వతేజ, ఎం.ప్రదీప్, యు.వెంకటచైతన్య, పి.సాయి కౌశిక్, బి.సూర్యహితేశ్వర్, కె.భానుచరణ్, ఎం.హర్షిత్, పి.వర్షిత్, సిద్ధు, డి.లోకేశ్, టి.మౌనీశ్, టి.ఆదర్శ్, జేమ్స్‌ను ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఇక బాలికల జట్టుకు దీక్షిత, ఎం.ఆరాధ్య, ఎస్.చైత్ర, పి.సహస్రలక్ష్మి, ఎం.నక్షత్ర, పి.హోత్రి, బి.గాయత్రీగ్రీష్మ, ఐ.సాత్విక, కె.హర్షిణి, అక్షనేనియ, పూనమ్ హన్సీ, ఈ.భవిత, టి.హెప్సిబా, సీహెచ్.శ్రీవాణి, అవంతిక ఎంపికయ్యారని తెలిపారు. బాస్కెట్‌బాల్ కోచ్‌లు కృష్ణమూర్తి, పీవీ రమణ, కె.రామారావు, పీఈటీలు సైదేశ్వరరావు, ఖుద్దూస్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులంతా ఐక్యతతో సాగాలి

రాజ్యసభ్య సభ్యుడు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర

అశ్వారావుపేటరూరల్: మున్నూరు కాపులందరూ ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచించారు. అశ్వారావుపేటలో శుక్రవారం జరిగిన మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల సాధన కోసం పార్లమెంట్‌లో పోరాడుతానని తెలిపారు. కాగా, మహిళా బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం కోసం సీఎం కేసీఆర్ విశేష కృషి చేశారని చెప్పారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం, కేసీఆర్ తిరిగి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సంఘం బాధ్యులు ఎంపీని సన్మానించారు. సమావేశంలో బీఆర్ఎస్, మున్నేరు కాపు సంఘం నాయకులు ఉప్పల వెంకటరమణ, ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, చిన్నంశెట్టి వెంకటనరసింహం, ఆకుల శ్రీనివాస్, మద్దాల నాగేశ్వరరావు, సుంకర రామారావు, బాలేపల్లి నాగరాజు, కృష్ణ దుర్గయ్య పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణకు పాటుపడండి

విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసాచారి

ఖమ్మంసహకారనగర్: ప్రకృతిని కాపాడేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, తద్వారా ఉపాధ్యాయులు కూడా భాగస్వాములు కావాలని విద్యాశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలోని 50 పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు నేషనల్ గ్రీన్‌కార్ప్స్ శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసాచారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కేశవపట్నం రవికుమార్ మాట్లాడగా రాష్ట్ర ప్రాజెక్ట్ ఆఫీసర్ మేజర్ శివకిరణ్, రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, జిల్లా సైన్స్‌అధికారి జగదీశ్వర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి



ఉద్యోగులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి శంకర్

కూసుమంచి: కూసుమంచిలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని గిరిజన సంక్షేమశాఖకు చెందిన ప్రత్యేకాధికారి, ట్రైకార్ జనరల్ మేనేజర్ కె.శంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన వసతులు, బోధన, మెనూ అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఆ తర్వాత హెచ్‌డబ్ల్యూఓ తిరుపతిరావుకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏటీడీఓ తిరుమల్‌రావు, ఏసీఎంఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.